# గట్టి మాటలు!

కాలమ్ రాయటంలోని కష్టాలు నాకు బాగా తెలుసు. అందులోనూ పరిధిని నిర్ణయించడం కుదరని ఎన్నారై కబుర్లలాంటి కాలమ్‌లు అయితే మరీనూ. వాటిని చదువుతుంటే రచయిత ఈ విషయం ఇంతకు ముందెక్కడో చెప్పాడు కదా అనిపించకూడదు. ఎంచుకునే సబ్జెక్టులే కాదు, వాటిని చెప్పే తీరులోనూ ఎంతో వైవిధ్యం, నిత్య నూతనత్వం కనపడాలి. వారం వారం ఠంచనుగా అందించాలి. ఈ ఈతి బాధల గురించి తెలీని పాఠకులెవరేనా తేలిగ్గా 'ఫలానా కాలమ్ బోరుకొడుతోంది ఎడిటర్జీ' అని ప్రతిక్కి కార్డు రాసి పడేస్తారేమోనన్న భయం ఒకటి పీడిస్తూ ఉంటుంది.

అయితే అన్నీ అందరికీ నచ్చేలా రాయడం ఏ కాలమిస్టుకైనా అసంభవం అని ఎడిటర్లకీ తెలుసు. కాబట్టి పాఠకుల రెస్పాన్స్ అనే దాన్ని కాచివడబోసేందుకు ఎవరి పద్ధతులు వాళ్ళకి ఉంటాయి. ట్రేడ్ సీక్రెట్స్‌లాంటి వన్నమాట. మెజారిటీ చదువరులను దృష్టిలో ఉంచుకునే ప్రతిక రూపుదిద్దుకుంటుందన్నది మాత్రం రహస్యం కాదు, వాస్తవం.

ఇష్టమైన పనిలో కష్టం తోచదని అందరికీ తెలిసిందే. అందుకే సత్యంగారు ఉద్యోగ బాధ్యతల్లో ఎంత బిజీ అయినా, తన రచనా వ్యాసాంగానికి ఎలాగోలా తీరిక చేసుకుంటూనే ఉన్నారు. పైన చెప్పిన కష్టాలన్నీ గట్టెక్కుతూనే ఉన్నారు. అందుకు ముందుగా ఆయన్ని అభినందించి తీరాలి.

ఎన్నారై అంటే ఇండియాలో లేని ఇండియన్ అన్నమాట. కానీ ఈ శీర్షిక కింద ఆయన చెప్పినవి కాలక్షేపం కబుర్లు కావు. ఒట్టి మాటలూ కావు. చాలా కాన్ఫిడెన్స్‌తో చెప్పిన గట్టి మాటలు. వాటిలో వింతలూ విశేషాలూ ఉంటాయి. రచయితగా సత్యంగారి అనుభవాలూ, అనుభూతులూ ఉంటాయి. కొత్త ఆలోచనలుంటాయి. ఇండియాలో పుట్టి పెరిగి, మరో దేశంలో ఉంటూ,

అప్పుడప్పుడూ మన దేశం వచ్చి చూసి వెళ్తున్న ఒక అనుభవజ్ఞుడి స్వగతంలా ఉంటాయి.

మారుతున్న సాంస్కృతిక, సామాజిక, రాజకీయ పరిస్థితుల అవలోకనంతోపాటు, విదేశాల్లో ఉంటున్న భారతీయుల మనస్తత్వ చిత్రణనీ సత్యంగారు అలవోకగా చేయగలిగారు. పాఠకులకి ఇంకా ఎన్నో విషయాలమీద కుతూహలం రేకెత్తించగలిగారు. అందుకు కారణం ఆయన శైలి. ఆయన చెప్పే ఏ కబురూ మరో కబురులా వుండదు. ఓసారి ఆప్త మిత్రుడిలా మనసులో మాటలు పంచుకుంటున్నట్టు ఉంటే, మరోసారి మాస్టారి అవతారమెత్తి పాఠం చెబుతున్నట్టు ఉంటుంది. ఒకసారి ప్రపంచాన్ని చూసి పరిహాసం చేస్తున్నట్టు తోస్తే, ఇంకోసారి మనని చూసి మనమే నవ్వుకోగలిగేట్లు చేస్తుంది. ఏ రకంగా చూసిన ఈ ఎన్నారై కబుర్లలో రచయిత హాస్యప్రియత్వం, సహృదయం స్పష్టంగా కనిపిస్తుంటాయి. నిష్ఠూరంగా ఉండే నిజాలనైనా సత్యంగారు నొప్పించకుండా తమాషాగా చెబుతారు. 'ఎన్నారై కబుర్లు' చదివాక ఈ మాట మీరూ అంటారు.

ఎ.ఎస్.లక్ష్మి
న్యూస్ ఎడిటర్
ఆంధ్రభూమి వారపత్రిక
ఆంధ్రభూమి మాసపత్రిక
36, సరోజినిదేవి రోడ్
సికింద్రాబాద్

# సత్యమేవ జయతే!

ఎన్నారై కబుర్లలో వ్రాసినట్టుగా, నేను ఎప్పుడు వివిధ సంస్కృతుల గురించి తెలుసుకునే సెమినార్లకి వెళ్ళినా, నన్నో విషయం బాధిస్తూ వుండేది.

చైనా జపాన్‌లాటి దేశాల్లో మనం ఎలా ప్రవర్తించాలో ఎలా ప్రవర్తించ కూడదో, ఏం చెప్పాలో ఏం చెప్పకూడదో నేర్పే సెమినార్లవి. అవేవో సరదాగా వున్నా నాలాటివారికి ఎంతో ఉపయోగకరంగా వుండేవి. మనకి కావలసిన వక్కడ సాధించుకు రావటానికి ఎంతో దోహదం చేసేవి. మరి ఇండియానించీ నెలనెలా కొన్ని వేలలో దిగుమతవుతున్న భారతీయులకి, ముఖ్యంగా తెలుగువారికి అమెరికా జీవితం సవ్యంగా గడపటానికి కావలసిన విషయాలపై సమాచారం ఇచ్చేవారు నాకంతగా కనపడలేదు. చుట్టం చూపుగా వచ్చేవాళ్ళకి ఫరవాలేదు ఎవరో ఇక్కడ సహాయం చేస్తారు. చదువుకోటానికి వచ్చేవాళ్ళూ ఉద్యోగాలకి వచ్చే వాళ్ళు మొదట్లో నానా బాధలూ పడటం చూస్తున్నదే.

ఇండియాలో స్నేహితుల ద్వారా చూసేవి పరిమితమైన అనుభవాలు. అందుకని నా పాతికేళ్ళ అమెరికా అనుభవంలో, నేను చూసినవీ నేర్చుకున్నవీ, మిత్రుల అనుభవాలూ, నాకు చేతనైన పద్ధతిలో వ్రాసి, పాఠకులకి అందివ్వటం నా బాధ్యత అనిపించింది.

అలాటివి నాలుగైదు వ్యాసాల్లో వ్రాసి ఆంధ్రభూమి వారపత్రికకి పంపించాను. ఎయస్‌లక్ష్మిగారవి ప్రచురిస్తాను కానీ, నాలుగైదులా కాదు ఒక శీర్షికలా వారపత్రికలో నడుపుదామని ఉత్తరం వ్రాశారు. ఇక్కడ ఆఫీసు పనితోనూ, తత్సంబంధమైన ప్రయాణాలతోనూ, నేను నడుపుతున్న తెలుగు స్కూలు పనితోనూ, కథా వ్యాసాంగంతో అప్పటికే ఎన్నో గంటలు పనిచేస్తున్న నాకది జరిగే పనిలా కనిపించలేదు. అదే వ్రాశాను. కానీ పట్టు విడవని లక్ష్మిగారు, మీరు కనీసం పది వ్యాసాలు వ్రాసేదాకా ఆగి, అప్పుడు ప్రచురణ మొదలుపెడతాను, దానితో మీకు సమయమూ సరిపోతుంది, వెసులుబాటూ అవుతుంది అని మొహమాట పెట్టారు. అలా మొదలయినాయి ఈ ఎన్నారై కబుర్లు.

ఒక సంవత్సరం పైన, అంటే 66 వ్యాసాలు వ్రాశాక, ఆపేద్దామనుకుని ఆగనా సాగనా అని ఒక వ్యాసం వ్రాశాను. సంపాదకులూ, పాఠకులూ సాగమనే ఆశీర్వదించారు. అలా ఈ వ్యాసాలు ఇప్పటికి నాలుగు సంవత్సరాల పైగా, 200 వ్రాశాను. అనుకున్నదానికన్నా ఇన్నాళ్ళు దీన్నిలా నడిపించింది లక్ష్మిగారి ప్రోత్సాహం పట్టుదలా. తర్వాత పాఠకుల స్పందనా వారి ఈమైల్సూ. మూడవది నాకు

తెలిసిన విషయాలు నలుగురితో పంచుకోవాలనే తపనా.

గవర్నమెంటాలిటీ కథలు అనే నా పుస్తకానికి, గురువుగారు ముళ్ళపూడి వెంకటరమణగారు ముందుమాట వ్రాశారు. నేను నా రచనల్లో, ఇన్‌ఫర్మేషన్ ఇస్తునే ఎంటర్టైయిన్ చేస్తాననీ, అందుకని నాది 'ఇన్ఫోటైన్‌మెంటాలిటీ' అనీ వ్రాశారు. దానికి జవాబుగా నేను కూడా - నా రచనల్లో ఎక్కడయినా హాస్యం కనిపిస్తే అది రమణగారి ప్రభావం అనీ, కనపడకపోతే అది నా 'రాత' అనీ వ్రాశాను. ఈ ఎన్నారై కబుర్లలో మీకు ఆ ఇన్ఫోటైన్‌మెంట్ కనిపిస్తే అది ఆయన ఆశీర్వాద ఫలితం.

నేను వ్రాసిన వాటిలో, నాకు వచ్చిన పాఠకుల స్పందన ప్రకారం, కొన్ని ఎంతో ఉపయోగకరంగానూ, కొన్ని హాస్యపూరితంగానూ, కొన్ని వ్యంగ్యంగానూ వున్నాయని. కొన్ని బాగాలేవనీ, వాటిల్లో పైన చెప్పినవి ఏమీలేవనీ, చెప్పిన వాళ్ళందరికీ కృతజ్ఞతలు. అవే నన్ను విషయపరంగా ముందుకు నడిపించిన మణిదీపాలు.

ఆంధ్రభూమి వారపత్రిక సంపాదకవర్గంవారికీ, ముఖ్యంగా లక్ష్మిగారికి నా హృదయపూర్వక ధన్యవాదాలు. ఈ పుస్తక ప్రచురణలో సహకరించిన మిత్రులూ, శ్రేయోభిలాషులూ రచన శాయిగారికి ధన్యవాదాలు. చక్కటి ముఖచిత్రం వేసిన కరుణాకర్‌గారికి కృతజ్ఞతలు. నేనూ రోజూ క్రమం తప్పకుండా, రెండు మూడు గంటలు వ్రాసుకోవటానికి, ఈ నాలుగేళ్ళూ, ఓపికతో సహకరించిన నా సహధర్మ చారిణి విమల నిజంగా సహన ధర్మచారిణే!

నేను వ్రాసిన 200 వ్యాసాలూ ఒక పుస్తకంలో పట్టటంలేదు కనుక, ఎన్నారై కబుర్లు - ఒకటి, ఎన్నారై కబుర్లు - మరోటి అని రెండు పుస్తకాలుగా ప్రచురిస్తున్నాం. ముందు చాల వ్యాసాలు తీసేసి, కొన్నే ఒకే పుస్తకంగా వేద్దామనుకున్నాం కానీ పాఠకాభిప్రాయం, మిత్రవాక్యం వేరుగా వున్నాయి. అన్నీ మాకు గైడుల్లా ఉపయోగపడేవే, ఆనందింపచేసేవే, కనుక అన్నీ కావాలన్నారు. ఆ విషయమే దృష్టిలో పెట్టుకుని, ఇంకో వడపోత పోసి కొద్ది వ్యాసాల్ని తీసేసి, రెండు పుస్తకాలుగా మీకు అందిస్తున్నాం. మీ అభిప్రాయాలు ఈమైల్ ద్వారా తెలియచేస్తే సంతోషిస్తాను.

భవదీయుడు
సత్యం మందపాటి